సాక్షి

వికారాబాద్

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



వందల్లో దరఖాస్తులు..

భూ సర్వే సమస్య రైతులను ఇబ్బంది పెడుతోంది. సర్వేయర్ లేకపోవడంతో సమస్యలు తీవ్రమవుతున్నాయి. 8లో▸



నిధుల కేటాయింపే..

రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడమే తప్ప ఖర్చుపెట్టడం లేదని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. 8లో▸



ఫుట్‌పాత్ ఆక్రమణలు

పరిగిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: విజయ బయో ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం ఈ నెల 10న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి అబ్దుల్ సుభాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు వంద మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఐటీఐ కళాశాల వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు వికారాబాద్ ప్రాంతంలోనే ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 96760 47444ను సంప్రదించాలన్నారు.

సెలవు దినంగా ప్రకటించండి



సేవాలాల్ సేన నాయకుల నిరసన

అనంతగిరి: ఈనెల 15న జరిగే సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేనావత్ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట గిరిజన నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జయంతి నిర్వహణకు ప్రభుత్వం నుంచి జిల్లాకు రూ.10లక్షలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్మించే డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో గిరిజనులకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రవినాయక్, సేవాలాల్ సేన జిల్లా ధర్మ జాగరణ అధ్యక్షుడు కిషన్ స్వామి, సలహాదారు చందర్‌నాయక్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

బషీరాబాద్: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి చదివే ఎస్సీ విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉపకారవేతనాల పర్యవేక్షణ మండల ఇన్‌చార్జి రాజేశ్వర్ తెలిపారు. కులం, ఆదాయం, బ్యాంకు పాసు పుస్తకం లేదా, పోస్టల్ అకౌంట్, స్కూల్ బోనఫైడ్, ఆధార్ కార్డుతో మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ ఫారాన్ని ఆయా పాఠశాల హెచ్‌ఎంలకు అందజేయాలని సూచించారు. 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఏడాదికి బాలురకు రూ.వెయ్యి, బాలికలకు 1,500 ఆర్థిక సాయం బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు. అలాగే రాజీవ్ విద్యామిషన్ ద్వారా 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.3 వేల చొప్పున జమ అవుతాయని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఎస్సీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని మైల్వార్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్ష

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో జిల్లా మత్స్యశాఖఅధికారి సుకీర్తి ఆధ్వర్యంలో బుధవారం ముదిరాజ్ మత్స్యకారుల పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు కోసం వృత్తి నైపుణ్య పరీక్ష నిర్వహించారు. 45 మందికి నల్ల చెరువులో చేపల వేట కోసం వల విసరడం, ఈదడం వంటి పరీక్షలు నిర్వహించారు.



కొడంగల్‌లోని రత్నం రైస్ మిల్లులో ధాన్యం బస్తాలు ఇలా..

పాలకుల నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం

- నేలపాలవుతున్న ధాన్యం

అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం ఈ చిత్రం.. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని రైస్ మిల్లులకు ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యం నేలపాలవుతోంది. పీడీఎస్ కింద ప్రభుత్వం రైస్ మిల్లులకు వరి ధాన్యం సరఫరా చేసింది. ఆ ధాన్యాన్ని భద్రపరిచి బియ్యంగా మార్చి ప్రభుత్వానికి సరఫరా చేయాల్సి ఉంది. అయితే సర్కార్ వరి ధాన్యం అన్న నిర్లక్ష్య ధోరణితో వాటికి రక్షణ కల్పించలేదు. గతంలో కురిసిన వర్షాలకు ధాన్యం బస్తాలు నానిపోయాయి. విత్తనాలు మొలకెత్తాయి. పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో నిర్లక్ష్యం నీడలో వరిధాన్యం బస్తాలు ఉన్నాయి. ధాన్యమంతా పందులు, పందికొక్కులు, ఎలుకల పాలవుతోంది.

– కొడంగల్

పోలెపల్లికి పోదాం.. జాతర చూద్దాం

- నేటి నుంచే ఎలమ్మతల్లి ఉత్సవాలు
- రాత్రి 10 గంటలకు అమ్మవారి రాక
- భారీ ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

బొంరాస్‌పేట: పోలెపల్లి జాతరకు భక్తజనం సిద్ధమవుతోంది. ప్రతియేటా మాఘమాసంలో దుద్యాల మండలం పోలెపల్లి ఎల్లమ్మ జాతర నిర్వహిస్తారు. గురువారం నుంచి నాల్గు రోజులపాటు సమ్మక్క సారక్క జాతరను తలపించేలా జరుగనుంది. రాత్రి 10గంటలకు గ్రామ వీధులగుండా అమ్మవారి వేంచేపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆలయాన్ని రంగులతో, విద్యుత్ కాంతులతో అలంకరించారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

జాతరకు వచ్చే భక్తులకు వికారాబాద్, నారాయణపేట జిల్లాలతోపాటు కర్ణాటక రాష్ట్రం నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలు నిరంతరం నిఘాలో ఉంటాయని ఆలయ కమిటీ మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం షిడే కార్యక్రమం జరుగుతుందని, ప్రముఖులు రానున్నారని వివరించారు.



విద్యుత్ కాంతుల్లో అమ్మవారి ఆలయం

జిల్లాలో మొబిలిటీ వ్యాలీ

జిల్లాకు మణిహారమే.. రూ.4వేల కోట్ల వ్యయంతో పెద్ద ప్రాజెక్టు రానుంది. మోమిన్‌పేట, నవాబుపేట మండలాల సరిహద్దు గ్రామాలైన ఎన్కెతల, ఆర్కతల రెవెన్యూ పరిధిలో ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నామని రెండు రోజుల క్రితం మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టు రాకతో జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయి. జిల్లాలో మొట్టమొదటి అతిపెద్ద ప్రాజెక్టు కావటం గమనార్హం. ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

రూ.4 వేల కోట్లతో భారీ ప్రాజెక్టు

- ముందుకు వచ్చిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ
- మోమిన్‌పేట, నవాబుపేట మండలాల్లో ఏర్పాటు
- 1200 ఎకరాల సేకరణకు కసరత్తు
- భూములు కోల్పోయిన ప్రతి ఇంటికీ ఉద్యోగం
- ఎకరానికి రూ. 17 లక్షల చొప్పున పరిహారం

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ఉమ్మడి జిల్లాలో నిర్మించతలపెట్టిన గండిపేట డెవలప్‌మెంట్ అథారిటీ కారిడార్‌లో భాగంగా ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే కొంత భూమిని టీఎస్ఐఐసీకి అప్పగించగా అవసరమైన భూమిని వారం రోజుల్లో అప్పగించేందుకు కసరత్తు చేస్తున్నారు. భూములు కోల్పోయిన అసైన్డ్ దారులకు నెల రోజుల్లో పరిహారం చెల్లించేలా కార్యాచరణ ప్రారంభించారు.

1200 ఎకరాల్లో ..

1200 ఎకరాల్లో మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. రూ. 4 వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. భూములు కోల్పోయిన అసైన్డ్ పట్టాదారులకు నేరుగా 500 మందికి ఉద్యోగాలు లభించనుండగా ఇంకా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్టులో ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలు తయారు చేయనున్నారు. పెద్ద ప్రాజెక్టు కావటంతో జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల రేడియేషన్‌లో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. దీని ప్రభావంతో జిల్లా పరిధిలోని నవాబుపేట, మోమిన్‌పేట, వికారాబాద్ మండలాలు, రంగారెడ్డిజిల్లా పరిధిలోని శంకర్‌పల్లి, సంగారెడ్డి మండల పరిధిలోని కొండాపూర్ మండలాలల ప్రాంతం ప్రత్యేక ఆర్థిక మండలిగా రూపాంతరం చెందనుంది. నగరం నుంచి కనెక్టివిటీ రోడ్లు కూడా మెరుగుపడనున్నాయి. చుట్టుపక్కల మండలాల్లో భూముల విలువలు కూడా పెరగనున్నాయి.



మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న ఎన్కెతల, ఆర్కతల గ్రామాల సరిహద్దు ప్రాంతం

వారంలో భూముల అప్పగింత

నవాబుపేట మండలం ఆర్కతల శివారులో ఇప్పటికే సర్వే నంబర్ 32లో 102 ఎకరాలు, సర్వే నంబర్ 12లో 57 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించిన అధికారులు టీఎస్ఐఐసీకి అప్పగించారు. ఆ భూములు సాగు చేసుకుంటున్న అసైన్డ్ పట్టాదారులకు ఎకరానికి రూ. 16 లక్షల చొప్పున పరిహారం కూడా చెల్లించారు. ఇక మోమిన్‌పేట మండలం ఎన్కెతల పరిధిలోని 174, 198 సర్వే నంబర్లలో మొత్తం 900 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో ఆధ్యాత్మిక సంస్థలు, దివ్యాంగుల సంస్థలకు కొంత భూమిని కేటాయించారు. ఇక 536.39 ఎకరాల ప్రభుత్వ భూమి టీఎస్ ఐఐసీకి ఇచ్చేందుకు అనుకూలంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇందులో 380 మంది అసైన్డ్ పట్టాదారులు ఉన్నారు. వారికి ఎకరానికి రూ. 17 లక్షలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించటంతో పాటు రైతులతో కూడా మాట్లాడి ఒప్పించారు. భూములు కోల్పోయిన వారికి పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇచ్చేందుకు మొబిలిటీ వ్యాలీ సంస్థ అంగీకరించినట్టు అధికారులు పేర్కొంటున్నారు. వారం రోజుల్లో టీఎస్ఐఐసీకి భూములు అప్పగించడంతో పాటు నెలలో పరిహారం చెల్లించే ప్రక్రియ కూడా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం



ప్రభుత్వ ఆదేశాలతో మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టు ఏర్పాటు కోసం భూముల అప్పగింతకు కసరత్తు చేస్తున్నాం. ఇప్పటికే ఉమ్మడి సర్వే నిర్వహించాం. ధార్మిక తదితర సంస్థలకు కేటాయించిన భూములు మినహాయించి మిగిలిన భూములు, అసైన్డ్ పట్టాదారులను గుర్తించాం. వారం రోజుల్లో టీఎస్ఐఐసీకి అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు నెల రోజుల్లో ఎకరానికి రూ. 17 లక్షల చొప్పున చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరగనుంది.

– విజయకుమారి, ఆర్డీఓ, వికారాబాద్

టికెట్లు ఇస్తూనే కుప్పకూలిన కండక్టర్

- బషీరాబాద్‌లో ఘటన



సంతోష్ కుమార్ మృతదేహం

బషీరాబాద్: విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ కండక్టర్ గుండెపోటుతో మృతి చెందారు. బషీరాబాద్‌లో బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తాండూరు మండలం సంగెం కలాన్ గ్రామానికి చెందిన పట్కారి సంతోష్ కుమార్ (38) కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాండూరు డిపో నుంచి బషీరాబాద్ లాస్ట్ ట్రిప్ డ్యూటీకి వెళ్లారు. బస్సులో ప్రయాణికులకు టికెట్లు ఇస్తూనే కుప్పకూలిపోయాడు. వెంటనే డ్రైవర్ బస్సు ఆపి కండక్టర్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రాణాలు వదిలాడని ప్రయాణికులు తెలిపారు. బషీరాబాద్ పోలీసులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి మరోసారి పరీక్షలు చేయగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అప్పటి వరకు తమతో ఉన్న తోటి ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందడంతో ఆర్టీసీ ఉద్యోగులు కన్నీరుమున్నీరయ్యారు. సంతోష్‌కుమార్‌కు భార్య కావేరి, సృష్టి, శివశంకర్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జువెనైల్ జస్టిస్ బోర్డుతో సత్వర న్యాయం

- బాల నేరస్తుల్లో మార్పు తెచ్చే బాధ్యత అందరిదీ
- జిల్లా న్యాయమూర్తి సుదర్శన్
- వికారాబాద్‌లో జస్టిస్ బోర్డు ప్రారంభం

వికారాబాద్ అర్బన్: సత్వర న్యాయానికి జువెనైల్ జస్టిస్ బోర్డులు దోహదం చేస్తాయని, బాల నేరస్తులను మంచి సమాజంవైపు నడిపించే బాధ్యత అందరిపై ఉందని జిల్లా న్యాయమూర్తి కె. సుదర్శన్ తెలిపారు. బుధవారం వికారాబాద్‌లోని ఎన్నెపల్లిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జువెనైల్ జస్టిస్ బోర్డును ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె. శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జువెనైల్ జస్టిస్ బోర్డు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉండేదన్నారు. జిల్లాకు ఒక జువెనైల్ జస్టిస్ బోర్డు ఏర్పాటులో భాగంగానే వికారాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జువెనైల్ జస్టిస్ బోర్డు (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం సవరించడం జరిగిందని, నేరారోపణ లేదా చట్టంతో నిర్బంధించిన పిల్లలను జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు ప్రవేశ పెట్టాల్సి ఉంటుందని జిల్లా న్యాయమూర్తి తెలిపారు. క్రిమినల్ కోడ్ ప్రొసీజర్ నిబంధనల ప్రకారం పిల్లలను వారి నేర కార్యకలాపాలకు దోషిగా నిందించడానికి వీలు లేదన్నారు. వారి చర్యలను అర్థం చేసుకొని, భవిష్యత్తులో బాలలను నేర కార్యకలాపాల నుంచి బయటపడేందుకు నైపుణ్యమైన కోర్సులలో శిక్షణ ఇప్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. న్యాయ మండలి ద్వారా పిల్లలకు సంబంధించిన కేసులను సత్వర పరిష్కారానికి జువెనైల్ జస్టిస్ బోర్డు ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి పనిచేయాల్సి ఉంటుందని, బాధ్యతగా ప్రవర్తించినప్పుడే బాలలకు న్యాయం జరుగుతుందన్నారు. పిల్లల కేసుల విషయంలో పోలీసులు, న్యాయవాదులు, ఉద్యోగులు మానవతా దృక్పథంతో నడుచుకోవాలన్నారు. పిల్లలకు మంచి పునరావాసం కల్పిస్తే మంచి భవిష్యత్‌వైపు వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ డీపీ శీతల్, డిస్ట్రిక్ట్ ట్రెనింగ్ సెంటర్ ఇన్‌చార్జి అడిషనల్ ఎస్పీ మురళీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవ రెడ్డి, జువెనైల్ జస్టిస్ బోర్డు మెంబర్ జి. వాసు, సత్యనారాయణ, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి సుదర్శన్

అభివృద్ధి పనులు వేగిరం చేయండి

- పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు
- ఈనెల 15లోగా పన్నులు వసూలు
- కలెక్టర్ నారాయణ్‌రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం

వికారాబాద్ అర్బన్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్యం, హరితహారం, జాతీయ ఉపాధి హామీ పనులపై ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కష్టపడి పనిచేసే అధికారులను ప్రజలు గుర్తిస్తారని తెలిపారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తూ కనీస అవసరాలు తీర్చేలా కృషి చేయాలని అన్నారు. పల్లెల్లో, పట్టణాల్లో వచ్చే నెల 15నాటికి వంద శాతం పన్ను వసూలు పూర్తి కావాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ప్రజలకు అవసరమయ్యే పనులను చేపట్టేందుకు ఎంపీడీవోలకే నేరుగా అధికారాలు ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

గ్రామాల్లోని మురుగు కాలువలను, వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలను రక్షించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నర్సరీల్లో మొక్కలను రక్షిస్తూ వచ్చే హరితహారం కార్యక్రమానికి అన్ని రకాల మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ నెల 17 నాటికి ఏపీఓలు, ఎంపీవోలు నర్సరీల పూర్తి వివరాలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వైకుంఠ ధామాలను పార్కులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ జానకీ రెడ్డి, డీపీఓ తరుణ్ కుమార్, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి నాటికి డబుల్‌బెడ్రూంలు

జిల్లాలో పురోగతిలో ఉన్న డబుల్‌బెడ్రూం పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసి అప్పగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మిగిలిన పనులను సైతం సత్వరం చేయాలన్నారు. మండలాలు, మున్సిపాలిటీల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

రుణ మాఫీ అయ్యేదెన్నడో?

- క్రాప్ లోన్స్‌పై పెరుగుతున్న వడ్డీ
- ఇప్పటికీ మోక్షం పొందని మొదటి విడత
- రాష్ట్ర బడ్జెట్‌తో చిగురిస్తున్న ఆశలు

కొడంగల్: రుణమాఫీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు రూ.50వేల రుణం కూడా మాఫీ కాలేదు. మరి రూ.లక్ష రుణం ఎప్పుడు మాఫీ అవుతుందోనని దీనంగా కాలం వెల్లదీస్తున్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.లక్ష వరకు రుణ మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రుణ మాఫీ పథకం ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రూ.25లోపు పంట రుణం తీసుకున్న రైతుల బకాయిలను మొదటి విడతలో మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ రెండేళ్ల క్రితం ప్రకటించారు. మొదటి విడత రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయకుండానే రూ.50వేల లోపు రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు మొదటి విడత పూర్తి స్థాయిలో కాలేదని రెండో విడత అసలే లేదని రైతులు వాపోతున్నారు.

హామీ అమలయ్యేనా

కొడంగల్ ప్రాథమిక సహకార సంఘంలో 897 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. అందులో రూ.25వేల లోపు రుణాలు తీసుకున్న రైతులు 326 మంది ఉన్నారు. వారంతా మొదటి విడతలో రుణాలు మాఫీ అవుతాయని కొత్త రుణాలు తీసుకోవాలని ఆశ పడ్డారు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి రెండేళ్లు దాటినా అందులో కేవలం 133 మందికి మాత్రమే రుణమాఫీ వచ్చింది. మిగిలిన రైతుల రుణం ఇప్పటి వరకు మాఫీ కాలేదు. ఇక రూ 50వేల లోపు పంట రుణాలు తీసుకున్న వారు 265 మంది ఉన్నారు. గత అసెంబ్లీ సమావేశంలో పంట రుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒక్క రైతుకు కూడా మాఫీ రాలేదు. మూడో విడతలో రూ.75వేలు, నాలుగో విడతో రూలక్ష రుణం ఎప్పుడు మాఫీ జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొడంగల్ ప్రాథమిక సహకార సంఘంలోనే పరిస్థితి ఇలా ఉంటే నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లోని ప్రాథమిక సహకార సంఘాలు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, ఏపీజీవీబీ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, మండల కేంద్రాల్లోని ఇతర బ్యాంకుల్లో వేలాది మంది రైతులు క్రాప్ లోన్స్ తీసుకున్నారు. మొదటి రెండు విడతల్లో ప్రభుత్వం ప్రకటించిన రూ.25వేలు, రూ.50వేలు రుణం వెంటనే మాఫీ చేసి రూ.లక్ష లోపు పంట రుణం తీసుకున్న వారి బాకీలను కూడా మాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు.



కొడంగల్ డీసీసీబీ

మాఫీ చేసి ఆదుకోవాలి



ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆదుకోవాలి. క్రాప్‌లోన్స్ పూర్తి స్థాయిలో మాఫీ చేస్తే మేలు జరుగుతుంది. గత వానాకాలం సీజన్‌లో అకాల వర్షాలతో పంటలకు నష్టం జరిగింది. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టం అంచనా వేయాలి. ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చే విధంగా అధికారులు కృషి చేయాలి. కంది, పత్తి పంటలకు తీవ్రంగా నష్టం జరిగింది. నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– మురహరి, రైతు, కొడంగల్

క్లుప్తంగా

నవోదయ ప్రవేశ పరీక్షకు గడువు పెంపు

ధారూరు: జవహర్‌ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం పొందేందుకు నవోదయ విద్యాలయ సమితి ఈనెల 15వరకు దరఖాస్తు గడువు పొడిగించిందని ఎంఈఓ బాబుసింగ్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. డాటా సవరణకు ఈనెల 16, 17 తేదీల్లో వెబ్‌సైట్‌ తెరిచి ఉంటుందని వివరించారు.

వారికి అండగా ఉంటాం

ఎస్పీ కోటిరెడ్డి



కానిస్టేబుల్‌ కృష్ణయ్య కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

అనంతగిరి: పోలీసు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కానిస్టేబుల్‌ కృష్ణయ్య కుటుంబ సభ్యులకు బుధవారం ఆయన రూ.4లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ వందన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బోర్డు సభ్యురాలికి సన్మానం



ఉమారాణిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

పూడూరు: రైల్వే బోర్డు సభ్యురాలు ఉమారాణి కుల్కచర్లలో ఓ పూజా కార్యక్రమానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆమె మండల కేంద్రంలోని బూత్‌ అధ్యక్షుడు సత్యనారాయణ ఇంటివద్ద కాసేపు ఆగారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్‌పటేల్‌ ఉమారాణిని సన్మానించారు. పూడూరులో ఏర్పాటు చేసిన కమలం పువ్వు స్కీన్‌ను మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనిల్‌, పార్టీ నాయకులు శ్రీశైలం, సుభాన్‌, కాశీ, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

11న అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ



వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నేతలు

కుల్కచర్ల: అంబేడ్కర్‌ ఆశయసాధనకు యువత కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, కాంగ్రెస్‌ పార్టీ బ్లాక్‌–2 అధ్యక్షుడు భరత్‌కుమార్‌ అన్నారు. ఈ నెల 11న చౌడాపూర్‌ మండలం పుర్సంపల్లి గ్రామంలో అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో చలో పుర్సంపల్లి వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్‌ సంఘం చౌడాపూర్‌ మండల అధ్యక్షుడు అశోక్‌, ప్రధాన కార్యదర్శి కుమార్‌, పుర్సంపల్లి సర్పంచ్‌ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



వేద డిగ్రీ కాలేజీ జట్టు



లయోలా కాలేజీ జట్టు



శ్రీ ఇందు కాలేజీ ఇబ్రహీంపట్నం

రసవత్తరంగా 'సాక్షి' ప్రీమియర్‌ లీగ్‌ పోటీలు

ఘట్‌కేసర్‌: మేడ్చల్‌–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌ మండలం ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్‌ క్రికెట్‌ మైదానంలో సాక్షి యాజమాన్యం నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్‌ లీగ్‌–4 (ఎస్‌పీఎల్‌) మ్యాచ్‌లు బుధవారం రసవత్తరంగా సాగాయి. ఈ లీగ్‌లో గ్రేటర్‌ హైదరాబాద్‌ పరిధిలోని 65 జట్లు పోటీపడుతున్నాయి.

విజేతల వివరాలు...

బాబురావు సాగర్‌ క్రికెట్‌ మైదానం–1

- మొదటి మ్యాచ్‌లో లయోలా డిగ్రీ కాలేజ్‌ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌ చేసిన అనురాగ్‌ యూనివర్సిటీ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసి ఓటమి పాలైంది. లయోలా క్రీడాకారుడు లోకేశ్‌ 33 బంతుల్లో 95 పరుగులు చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.
- రెండవ మ్యాచ్‌లో వసుంధర డిగ్రీ కాలేజ్‌ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌ చేసిన విజ్ఞాన భారతి ఇంజినీరింగ్‌ కళాశాల జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేసి గెలుపొందింది. విజ్ఞాన భారతి కళాశాల క్రీడాకారుడు కౌస్తుబ్‌ 16 బంతుల్లో 32 పరుగులు చేశాడు.
- మూడవ మ్యాచ్‌లో ఎస్పీ కాలేజ్‌ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌ చేసిన శ్రేయ ఇంజినీరింగ్‌ కళాశాల–బి జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసి ఓడింది. ఎస్పీ కాలేజ్‌ క్రీడాకారుడు వినిక్‌ 33 బంతుల్లో 66 పరుగులు చేశాడు.

బాబురావు సాగర్‌ క్రికెట్‌ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో ముఫకంజా జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌ చేసిన వేద డిగ్రీ కాలేజ్‌–బి జట్టు 7.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసి గెలుపొందింది.
- రెండో మ్యాచ్‌లో సిద్ధార్థ ఇంజినీరింగ్‌ కళాశాల జట్టు 7.1 ఓవర్లలో ఆలౌట్‌తో 43 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌ చేసిన సుల్తాన్‌పూర్‌ జేఎన్టీయూ జట్టు 6.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 46 పరుగులు చేసి గెలుపొందింది.
- మూడవ మ్యాచ్‌లో శ్రీ ఇందు ఇంజినీరింగ్‌ కళాశాల–ఎ జట్టు 10 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌ చేసిన సీఎంఆర్‌ ఇంజినీరింగ్‌ కళాశాల–సీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసి ఓడిపోయింది. శ్రీ ఇందు క్రీడాకారుడు గౌతమ్‌ 15 బంతుల్లో 32 పరుగులు చేశాడు.

నిధుల కేటాయింపుతో సరి

రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌ ధ్వజం

మోమిన్‌పేట: తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయించడమే తప్ప ఖర్చుపెట్టడం లేదని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని వెల్‌చాల్‌ గ్రామంలో హాథ్‌ సే హాథ్‌ జోడో యాత్రను ప్రారంభించారు. గ్రామ పంచాయితీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్‌కుమార్‌ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోన్న బీఆర్‌ఎస్‌ను బొందపెట్టాలని పిలుపునిచ్చారు. గత బడ్జెట్‌లో దళితబంధుకు రూ.17వేల కోట్లు కేటాయించి కేవలం రూ.200కోట్లు ఇచ్చారన్నారు. రుణమాఫీకి అరకొర నిధులు కేటాయించి రైతులను మోసం చేస్తోందన్నారు. వ్యవసాయ పరికరాలపై సబ్సిడీని పూర్తిగా ఎత్తివేశారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు నిధులు కేటాయించినా చిల్లిగవ్వా ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి విచక్షణ అధికారం కింద రూ.10వేల కోట్లను పెట్టుకుని గజ్వేల్‌, సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాలను మాత్రమే అభివృద్ధి చేస్తున్నారని ఆరోపించారు. నాలుగేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశామని చెబుతున్న ప్రభుత్వం.. ఏళ్లు గడుస్తున్నా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పూర్తిచేయడం లేదని ప్రశ్నించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంతోశ్‌ కుమార్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సిరాజుద్దీన్‌, నాయకులు సుధాకర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేందర్‌, చంద్రయ్య, మాణయ్య, శ్రీశైలం, శ్రీనివాస్‌, సుభాష్‌గౌడ్‌, బాబు, బుజ్జయ్యగౌడ్‌, రవీందర్‌రెడ్డి, సుభాష్‌, వేమారెడ్డి, వాహిద్‌ తదితరులు పాల్గొన్నారు.



వెల్‌చాల్‌ గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న ప్రసాద్‌కుమార్‌

వందల్లో దరఖాస్తులు.. పదుల్లో పరిష్కారం

ధరణితో ఇబ్బంది పడుతున్న రైతులకు భూ సర్వే తలనొప్పిగా మారింది. సర్వేయర్‌ లేక దరఖాస్తులు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

- సర్వేయర్‌ లేక పేరుకుపోతున్న అప్లికేషన్లు
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు



పెద్దేముల్‌ తహసీల్దార్‌ కార్యాలయం

పెద్దేముల్‌: భూ సర్వే సమస్య రైతులను ఇబ్బంది పెడుతోంది. ఎన్ని దరఖాస్తులు చేసినా సర్వేయర్‌ రాకపోవడంతో సమస్యలు తీవ్రమవుతున్నాయని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. జిల్లా పరిధిలో రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం, భూ విక్రయాలు పెరగాయి. మండలానికి నియమించిన సర్వేయర్‌ ఎక్కడ ఉంటారో.. ఎప్పుడు వస్తారో తెలియయడం లేదని వాపోతున్నారు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరిగి తిప్పలు పడుతున్నామని రైతులు మండిపడుతున్నారు. మూడేళ్లుగా మండలానికి పర్మినెంట్‌ సర్వేయర్‌ లేక రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. అధికారులు మాత్రం గడువు పూర్తైన వెంటనే దరఖాస్తులు రిజెక్ట్‌ చేస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రైవేటు సర్వేయర్లను ఆశ్రయిస్తున్న రైతులు

మండల పరిధిలో 30 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో రైతులు భూముల క్రయవిక్రయాలకు సర్వేయరే ప్రధానం. సర్వే చేయనిదే భూ రిజిస్ట్రేషన్‌ చేయడం లేదు. దీంతో రైతులు చలాన్‌లు కట్టి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మంబాపూర్‌, పెద్దేముల్‌, ఇందూరు, తట్టెపల్లి, ఆత్కూర్‌తో పాటు పలు గ్రామాల రైతులు గత్యంతరం ప్రైవేట్‌ సర్వేయర్‌లను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఉన్న సర్వేయర్‌ మహేందర్‌ వికారాబాద్‌కు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి తాండూరు మండల సర్వేయర్‌ శ్రీహరి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. తర్వాత ఔట్‌ సోర్సింగ్‌ విధానంలో నసీర్‌ను నియమించారు. సమయానికి వేతనాలు చెల్లించకపోవడంతో ఆయన సక్రమంగా విధులకు హాజరవ్వడం లేదని చర్చించుకుంటున్నారు. ఇదే సమస్యను ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సమాధానం దాటేస్తున్న అధికారులు

భూ సర్వే కోసం 200పైగా దరఖాస్తులు చేసుకోగా పదుల సంఖ్యలో పరిష్కారమైనట్లు సమాచారం. మిగిలిన దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతూ అలసిపోతున్నారు. ప్రభుత్వానికి ధరణి ఆదాయంపైనున్న శ్రద్ధ రైతుల సమస్యలపై చూపడం లేదని రైతులు మండిపడుతున్నారు. మీ సేవ కేంద్రాల్లో రూ.295 చెల్లించి చలాన్‌ తీసుకుంటున్నారు. తహసీల్దార్‌ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుటున్నారు. కానీ భూమల సర్వే చేపట్టడం లేదు. ఇదే విషయమై మండలాధికారులను ప్రశ్నిస్తే సర్వేయర్‌ లేడని సమాధానం దాటేస్తున్నారు.

సర్వే తర్వాతే రిజిస్ట్రేషన్‌

పొరుగు రాష్ట్రం కర్ణాటకలో ఏ భూమైనా క్రయవిక్రయాలు చేసేందుకు ముందుగా సర్వేచేసి, హద్దులు చూపి, నక్ష వేసి రిపోర్టు ఇచ్చిన తర్వాతే భూమి రిజిస్ట్రేషన్‌ చేస్తుంది.. తెలంగాణలోనూ సర్వే చేసిన తరువాతనే రిజిస్ట్రేషన్‌ చేయాలని కోరుతున్నారు.

సర్వేయర్‌ను నియమించాలి



ప్రభుత్వం మండలానికి పర్మినెంట్‌ సర్వేయర్‌ను ఏర్పాటు చేయాలి. భూ సర్వేల కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెందుతున్నారు. అధికారులకు సమస్యను ఫిర్యాదు చేస్తే సమాధానం చెప్పి దాటవేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పర్మినెంట్‌ సర్వేయర్‌ను ఏర్పాటు చేయాలి.

– వెంకటరెడ్డి, రైతు, అడ్కిచెర్ల

చర్యలు తీసుకుంటాం



మండలానికి పర్మినెంట్‌ సర్వేయర్‌ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు మండలాలకు ఒకే సర్వేయర్‌ అవ్వడంతో సమస్యల ఉత్పన్నమవుతోంది. దరఖాస్తు చేసుకున్న రైతుల భూములను సత్వరమే చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. సర్వేయర్‌ ప్రతీ వారం మూడు రోజులపాటు అందుబాటులో ఉందేందుకు కృషి చేస్తాం.

– విద్యాసాగర్‌రెడ్డి, తహసీల్దార్‌, పెద్దేముల్‌

మాలధారణ పవిత్రమైనది

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాలధారులను సన్మానిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

కుల్కచర్ల: భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను మనమే పరిరక్షించుకోవాలని చెవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఘనపూర్‌గ్రామంలో జ్యోతిర్లింగ మహాపడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ. మాలధారణ అత్యంత పవిత్రమైనదని.. వ్యక్తి మానసిక ప్రవర్తనలో ఉన్నతమైన మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, నియోజకవర్గ కోఆర్డినేటర్‌ మిట్టా పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌ విజయలక్ష్మిగోపాల్‌, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌, నాయకులు రాఘవేందర్‌ గౌడ్‌, బాలయ్య, రాంచంద్రయ్య, అంజిలయ్య, చంద్రలింగం, శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్‌

ఎంపీటీసీ సభ్యుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి



బహుమతి అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

తాండూరు రూరల్‌: కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్‌ ఉంటుందని ఎంపీటీసీ సభ్యుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఐనెల్లి శివారులోని తెలంగాణ మోడల్‌ స్కూల్‌ బీఆర్‌ఎస్‌ విద్యార్థి విభాగం అధ్యక్షుడు జిలాని కేసీఆర్‌ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ పేద విద్యార్థుల చదువుకోసం గురుకుల హాస్టళ్లు ప్రారంభించారని చెప్పారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమాశంకర్‌, శకుంతల, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి రూ.5.77 కోట్లు

ధారూరు: మండలాభివృద్ధికి రూ.5.77 కోట్ల నిధులు మంజూరయ్యాయని బీఆర్‌ఎస్‌ ప్రజాప్రతినిధులు, నాయకులు వెల్లడించారు. బుధవారం స్థానిక స్టార్‌ ఫంక్షన్‌ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి అత్యధిక నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రతీ పంచాయతీకి రూ.5లక్షలు తగ్గకుండా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. మోమిన్‌పేట్‌లో 1200 ఎకరాల్లో రూ.50వేల కోట్ల నిధులతో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశంలో ముందంజలో ఉంచిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రాజునాయక్‌, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వెంకటయ్య, బీఆర్‌ఎస్‌ యువజన విభాగం మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మైనార్టీ సెల్‌ మండల అధ్యక్షుడు ఇస్మాయిల్‌, ధారూరు పీఏసీఎస్‌ డైరెక్టర్‌ సుధాకర్‌గౌడ్‌, మైలారం సర్పంచ్‌ శ్రీనివాస్‌, నాయకులు చెన్నయ్య, చిన్నయ్యగౌడ్‌, లక్ష్మయ్య, వెంకట్రాంరెడ్డి, విజయకుమార్‌, రహమతుల్లాఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ ప్రజాప్రతినిధులు, నాయకులు

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



అర్షద్‌

కోహీర్‌(జహీరాబాద్‌): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని దిగ్వాల్‌ గ్రామంలో 65 నంబర్‌ జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేశ్‌ తెలిపిన ప్రకారం.. జిల్లా పరిధిలోని మోమిన్‌పేట్‌ మండలం కొత్తకోల్‌కుంద గ్రామస్తుడు అర్షద్‌ (16), తన మిత్రుడు జహీర్‌తో కలిసి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో జహీరాబాద్‌ నుంచి సంగారెడ్డి వెళ్తున్న ఓ కంటెయినర్‌ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అర్షద్‌ తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని జహీరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. జహీర్‌ చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి నిజామొద్దీన్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

భర్త బలవన్మరణం

బంట్వారం: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం బంట్వారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్‌కుమార్‌ తెలిపిన ప్రకారం.. బంట్వారం గ్రామానికి చెందిన దశరథ (47) మద్యానికి బానిసై భార్య అనంతమ్మతో నిత్యం గొడవపడుతుండేవాడు. దీంతో ఆమె నెల రోజుల క్రితం రొంపల్లిలోని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన దశరథ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీరికి ఇద్దరు సంతానం. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

సూచనలు పాటించండి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌



అనంతగిరిపల్లిలో పొలాలను పరిశీలిస్తున్న డీఏఓ

అనంతగిరి: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌ అన్నారు. బుధవారం ఆయన వికారాబాద్‌ మున్సిపల్‌ పరిధిలోని అనంతగిరిపల్లిలో వరి పంటను పరిశీలించి రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు, సూచనలు అందజేశారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు సోకే అవకాశం ఉంటుందన్నారు. శాఖీయ దశలో ఉన్న పంటలో గమనించినట్లయితే నివారణకు లీటరు నీటికి 2గ్రాముల కార్బన్‌ హైడ్రో క్లోరైడ్‌ 50 ఎస్‌పీ మందును కలిపి పిచికారీ చేయాలని లేదా 8 కిలోల కార్టాప్‌ హైడ్రోక్లోరైడ్‌ 4జీ లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్‌ 3జీ లేదా 4 కిలోల క్లోరాం ట్రానిలిపోల్‌ 0.4జీ గుళికలు ఎకరా పొలానికి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్‌కుమార్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌ లాల్‌కృష్ణ



అభివాదం చేస్తున్న బీసీ నాయకులు

పరిగి: కేంద్ర బడ్జెట్‌లో బీసీలను నిర్లక్ష్యం చేయడం పట్ల బుధవారం డిల్లీ జంతర్‌ మంతర్‌ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌ లాల్‌కృష్ణ జాతీయ అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్యతో కలసి పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌తో బీసీ సంక్షేమానికి కేవలం రూ.2వేల కోట్లు కేటాయించడం సిగ్గుచేటన్నారు. దేశ జనాభాలో సగభాగం ఉన్న బీసీలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందన్నారు. బీసీల సంక్షేమం, సమస్యలపై సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు ఉన్నప్పటికీ రాజకీయ రిజర్వేషన్లు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల ఎంపికలో రసాభాస

- లాటరీని బహిష్కరించిన దరఖాస్తుదారులు

బంట్వారం: మైనార్టీ కార్పొరేషన్‌ రుణాల ఎంపిక రసాభాసగా మారింది. లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు బుధవారం బంట్వారం మండల పరిషత్‌ కార్యాలయంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. అధికారికంగా 73 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ బాలయ్య తెలిపారు. రూ.లక్ష చొప్పున ఇద్దరికి, రూ.2 లక్షల రుణానికి ఒకరికి మంజూరవ్వడంతో దరఖాస్తుదారులు ఆందోళనకు దిగారు. మూడు యూనిట్లు మంజూరైతే లాటరీ తీయడం వద్దంటూ నిరసనకు దిగారు. సీఎం డౌన్‌ డౌన్‌ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బయటికి వెళ్లిపోయారు. దరఖాస్తుదారుల ఆందోళనతో ఎంపీడీఓ కార్యాలయంలో గందరగోళం నెలకొంది. అనంతరం లబ్ధిదారుల ఎంపికను బహిష్కరిస్తూ దరఖాస్తుదారులు ఎంపీడీఓకు మెమోరాండం అందజేశారు. మూడు వందలకు పైగా దరఖాస్తుదారులు ఉంటే మూడు యూనిట్లు మాత్రమే మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కనీసం వంద యూనిట్‌లు మంజూరు చేయాలంటూ డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్‌, జెడ్పీటీసీ సభ్యురాలు సంతోష, ఎంపీడీఓ బాలయ్య, ఎంపీఓ విజయ్‌కుమార్‌, సూపరింటెండెంట్‌ షిండే, జేపీ షఫీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దరఖాస్తుదారులు